# పరుగెత్తి పాలే త్రాగుదాం

"పరుగెత్తి పాలు త్రాగేకన్నా నించుని నీళ్ళు త్రాగితే మేలు"— చెప్పడానికి ఎంతో సులువు, ఇటువంటి శ్రీరంగనీతులు, కాని, ఆచరణలోకి తేవడానికి సాహసించగలమా ?

ఒక వేళ సాహసిస్తామే అనుకోండి ఎందుకు సాహసించాలని ? సాహసించిచేసే ఘనకార్యం నించుని నీళ్ళు త్రాగడమా ? సాహసించి నీళ్ళు త్రాగాల్సినంత ఖర్మమే ముంచ్చింది? వొద్దు స్వామీ, ముమ్మాటికి వొద్దు !

దేవరా! పరుగెత్తి పాలే త్రాగుదాం. నించుని నీళ్లు త్రాగితే నీళ్ళు కారిపోతాం. పెద్దలు చెప్పడానికేంలేండి. మహానుభావులు, ఎన్నైనా చెబుతారు! వారి వొంటికి మాత్రంపడి ఏడిసిందా, నించుని నీళ్లు త్రాగడం ?!.....

అసలు ఈ సామెతలోనే వుంది ఎంతో మహత్తరమైన సందేశం. ఈ సందేశాన్ని మనం సరిగ్గా అర్థంచేసుకుంటే ఇది ఏ కొద్ది మంది ఆలంకారికుల నోటిలోంచో కేవలం సారస్వతంగా వెలువడవలసిందే గాని నిత్య జీవితంలో ప్రజానీకంచేత ఉచ్చరింపబడటానికి గాని, అనుసరింపబడటానికి గాని ఉద్దేశింపబడినది కాదని తెలియవస్తుంది.

ఈ సామెతలో మహత్తరమైన అపార్థానికి చక్కటి రాజమార్గం గోచరిస్తుంది. మనం దాన్ని అనుసరించి చూద్దాం—

'పరుగెత్తి పాలు త్రాగేకన్నా నించుని నీళ్ళు త్రాగడం మేలు,' అంటే ఈ సామెతకారుని దృష్టిలో ఈ సామెత వెలువడిన నాటికి అనేకమంది పరుగెత్తి పాలుత్రాగే స్వభావంగలవారేననీ వారంతా అంతటినుంచి నించుని నీళ్లుత్రాగితే మేలు అనీ అయివుంటుంది.

అంటే, ఈ సామెత ద్వారా సామెత కారుడొక విప్లవాన్ని తీసుకు రావడానికి చూశాడు-ప్రపంచంచేత పాలను త్రాగడం మానిపించి నీళ్ళను త్రాగిద్దామని చూశాడు.

ఎందుకని అడక్కండి—

అందరితోపాటూ ఆ సామెతకారుడు పరుగెత్తలేక పోయివుండ వచ్చును-

ఒకవేళ పరుగెత్తి పాలను పట్టుకున్నా వాటిని హరాయించుకునే శక్తి, అతడిలో వుండక పోవచ్చును-

ఒక వేళ హరాయించుకొనే శక్తి పరుగెత్తగల శక్తీ రెండూ కూడా వుండి అతడు పరుగెత్తి పాలను పట్టుకున్నప్పటికీ అవి ప్రమాద వశాత్తూ అతడి చేతిలోంచి జారిపోయి నేలపాలై వుండవచ్చును.

ఆపళాన అతడు నించుని అతి సాహసంగా నీళ్ళు త్రాగి వుండ వచ్చును, గత్యంతరంలేక-ఆ నీళ్ళు ఆ పరిస్థితులలో అతడి వొంటికి బాగానే పడివుండవచ్చును.

అందుచేత, విఘ్నేశ్వరుడి బొడ్డులో వ్రేలుదూర్చిన తుంటరి పిల్ల కాయలాగ 'నించుని నీళ్లుత్రాగడం మేలు' అని అతడు అనివుండ వచ్చును.

మిగతా ప్రపంచం అతడ్ని అనుసరించలేక పోయినా అతడు చెప్పిన దానిలో నిజం లేకపోలేదని అనుకొని వుండవచ్చును.

అందువల్లనే ఈ సామెత ఈ రోజునాకా చిరంజీవిగా వుండి పోయింది.

ఒక చెంపమీద కొడుతూంటే రెండో చెంపను కూడా కొట్టేవాడి చేతికి అందివ్వమన్నాడు క్రైస్తు. ఇలా చేస్తేవాడు నిర్విణ్ణుడైపోయి, కొట్టడం మానేస్తాడని భావం. దీనిలోని నిజానిజాలను చాలా కాలం నుంచి ప్రపంచం పరిశోధిస్తూనే వుంది. మిగతా విషయాలలో దీని ఫలితాలు ఎలావుంటాయో నాకు తెలీదు గాని పాలవిషయంలో మాత్రం చూస్తే పరుగెత్తి పాలు త్రాగలేని వాడిని, నించుని నీళ్లుకూడా త్రాగ నీయదు ప్రపంచం-

దీనిలోని సత్యం ఈ నాడు మనం అన్ని జీవిత పంథాలలోనూ కూడా చూస్తూనే వున్నాం. మెత్తగా కనిపిస్తే చావకొడతారనే Live dangerously ఇతరులకు హడలు పుట్టించేట్టుగా బ్రతకమన్నాడు నీక్ రచయిత.

ఈ కాలమానంలో కొలిచిచూస్తే పరుగెత్తి పాలేకాదు, ఇంకా ఏమైనా కూడా త్రాగుతాను అనే ధీమా, సాహసం ప్రతి వ్యక్తిలోనూ వుండాలి. అంతేగాని, 'నేను పరుగెత్తి పాలు త్రాగలేను-నించుని నీళ్లే త్రాగుతాను' అని గాని ఎవరైనా అన్నట్టయితే 'ఓరి చవటపెయ్యమ్మా! నీవు నీళ్ళు త్రాగడానికి కూడా తాహతులేదురా' అని కరవొస్తుంది ప్రపంచం.

పెద్దపులిమీద స్వారిచేసే వాడు భూమ్మీద నడవలేనిమాట నిజమే. కాని. పెద్ద పులిమీద స్వారీచేసే వాడినీ భూమ్మీద నడిచేవాడినీ ఇద్దర్నీ బాగా నిశితంగా పరీక్షించి చూడండి-భూమ్మీద నడిచెవాడు హడిలడిలిపోతూ రోడ్డు ప్రక్కగా జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ వెడ్తూంటే, పెద్దపులి నెక్కినవాడు రయియమంటూవచ్చి అతడ్ని తొక్కేసి పోతాడు. నించుని నీళ్లు త్రాగుతాననే వాడు కూడా ఇట్టి ప్రమాదానికే గుర్రి అవుతాడు!

---

# సూర్యుడు మన శత్రువు

చిన్నప్పు డెప్పుడో కాశీమజిలీ కథల్లో చదువుకున్నాం - అదేదో పట్నంలో పగటివేళ సంచరించడం, పనులుచేయడం అపరాధమనీ, రాత్రివేళ అంతా తమ పనులను చేసుకోవాలనీ, ఈ నిబంధనలను అతిక్ర మించినవారు శిక్షార్హులనీ యిత్యాదయః, ఆ కథ చదివిన వెంటనే ఆ పద్ధతి అతి విచిత్రమైనదనీ, దాన్ని అమలులోకి తెచ్చిన ఆ పట్నపు రాజుగారు మతిభ్రష్టుడో, పగటి కలలుకనే స్వభావం కలవాడో అయి వుండాలనీ మనకు తోస్తుంది. కాని మన మనస్సులు తమ లేత స్వభావం నుండి తప్పుకుని, ముదిరి, బాగాముగిరి, అనేక అనుభవాలకు కరిగి, వడపోయబడి, తీర్పు చెప్పేశక్తిని సంపాదించుకునే పరిస్థితికి వచ్చేసరికి, ఆ విషయాన్ని గురించి చర్చించి చూస్తే అందులో అట్టే విచిత్రంలేదనీ, నిజానికి అంతా తమతమ పనులను పగటి వేళకంటే రాత్రివేళ చేస్తేనే బాగుంటుందనీ తెలియ వస్తుంది.

ఈ విషయం నేను కొత్తగా కనిపెట్టింది కాదు. అందరకూ తెలిసిందే. ఉష్ణప్రదేశాలలో పదార్థాలకు చలనం తక్కువ, నిద్ర ఎక్కువ, మీరు